క్లుప్తంగా

ప్రతి ఒక్కరు వైద్య పరీక్షలు చేయించుకోవాలి



పాన్‌గల్: ప్రతిఒక్కరు 30 ఏండ్లు దాటిన వారు వైద్యపరీక్షలు చేయించుకోవాలని ఆయుష్మాన్ మందిర్ వైద్యుడు మైథిలి అన్నారు. శనివారం మండలంలోని అన్నారం గ్రామాన్ని పైలట్ స్క్రీనింగ్‌కు ఎంపిక చేశారు. గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధుల వివరాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. హైపర్ టెన్షన్, డయాబెటిస్, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, పాలియేటీవ్ కేర్ స్క్రీనింగ్, జిరియాట్రిక్ స్రీనింగ్‌పై పూర్తివివరాలు సేకరిస్తారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శాంతమ్మ, రేవతి పాల్గొన్నారు.

దాతల తోడ్పాటు మరువలేనిది



పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు అందిస్తున్న తోడ్పాటు మరువలేనిదని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన రాచూరి సురేష్, అన్నెశివ మిత్రబృందం ఆధ్వర్యంలో రూ.18,500 విలువైన పలకలు, నోటు పుస్తకాలు, టైలు, బెల్టులు, బూట్లను ఎంఈఓ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీరశేఖర్, మాజీసర్పంచ్‌లు నాగేంద్రం, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



వీపనగండ్ల: మండలంలోని పూల్గర్‌చర్ల గ్రామంలో ఇటీవల మృతిచెందిన ఇరువురి కుటుంబ సభ్యులకు గ్రామ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సురేందర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బోయ గంగరాములు వారంరోజుల క్రితం మృతిచెందగా అతడి భార్య సుగుణమ్మకు రూ.5వేలతో పాటు, సన్నబియ్యాన్ని అందజేశారు. అలాగే శీలం లక్ష్మీదేవమ్మ మృతిచెందగా మృతురాలి కుమారుడు విష్ణుకు రూ.5వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ నరసింహ, బాలస్వామి పాల్గొన్నారు.

కార్గిల్ అమర వీరులకు ఘన నివాళి



వనపర్తిటౌన్: ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశం కోసం పోరాడి అమరులైన సైనికులను స్మరించడం మనందరి బాధ్యత అని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల హెచ్‌ఎం గురురాజుయాదవ్ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక పాఠశాలలో మై భారత్, నిస్వార్థ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో భరతమాత చిత్రపటానికి పూలమాల, కార్గిల్ విజయ్ దివస్‌లో అమరులైన 527 మంది జవాన్లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిరంజనయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, నరేష్, నాగేశ్వర్‌రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు ఊరట.. మెట్ట పంటలకు జీవం



పాన్‌గల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలన్నర దాటినా సరైన వర్షాల్లేక ఆందోళన చెందుతున్న అన్నదాతలకు గత మూడు, నాల్గురోజులుగా కురుస్తున్న వర్షాలు ఊరటనిచ్చాయి. ఇప్పటి వరకు అరకొరగా వరినాట్లను వేస్తున్న రైతులకు ఈ వర్షాలు ఊతమిచ్చాయి. ఇప్పటికే సాగు చేసిన అముదం, జొన్న, మొక్కజొన్న , పప్పు ధాన్యాలు, కూరగాయలు తదితర ఆరుతడి పంటలకు ఊపిరి పోశాయి. వారం రోజు ల క్రితం వరకు జూలై నెలల్లో 29 శాతం లోటు వర్షపాతం ఉండగా శనివారం నాటికి 12 శాతం లోటు ఏర్పడిందని అధికారులు పేర్కొన్నారు.

నిల్వనీటి పారబోత అంతంతే

- ప్రతి వారం పక్కా ప్రణాళిక కరువు
- వారానికోసారి వార్డుఅంతటా చేపట్టడంలో విఫలం
- ప్రజలకు అవగాహన పెంచడంలో వైఫల్యం
- సీజనల్ వ్యాధుల నిర్మూలన లక్ష్యంపై నిర్లక్ష్యం



వనపర్తిలో నిల్వ నీటిని పారబోస్తున్న పుర అధికారులు (ఫైల్)

వనపర్తిటౌన్: నిల్వనీటి పారబోత వనపర్తి జిల్లాలో అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. ప్రజల నివాసాల్లో నిల్వనీరు రోజుల తరబడి అలాగే ఉండటం కారణంగా, ఎక్కడపడితే అక్కడ మురుగు నీరు, చెత్తాచెదారం పేరుకపోవడం ప్రాణాంతక వ్యాధులకు కారణమని ప్రభుత్వం భావించింది. ఇందులో ప్రధానంగా నిల్వ నీరు నివాసాల్లో రోజుల తరబడి అలాగే ఉంచుకోవడంతో ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయి. వీటి నుంచి గట్టెక్కేందుకు ప్రజలు విధిగా నిల్వ నీటిని పారబోసేలా అవగాహన కల్పించాల్సి ఉంది. జిల్లాలోని వనపర్తి, పెబ్బేర్, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత మున్సిపాలిటీల్లో అవగాహన కల్పించడంలో పురపాలిక అధికారులు విఫలం చెందుతున్నారు. మున్సిపాలిటీల్లో 100 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతిరోజూ, ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడేతో నిర్దిత సమయంలో కార్యక్రమం చేపట్టడం మినహా ప్రత్యేక చర్యలేవీ తీసుకోకపోవడం గమనార్హం. మూడురోజులకు మించి నిల్వనీరు ఉంటే డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. వీటిపై ప్రజలు అవగాహన పెంచేందుకు మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు, మహిళా సంఘాల ఆర్పీలు ప్రతివార్డులో ఇద్దరు, ముగ్గురు ఉన్నా.. ప్రజా అవగాహనపై ప్రభావం కనిపించడం లేదు. ప్రస్తుతం ఉన్న చాలా మటుకు వార్డులు నాలుగైదారు హద్దులుగా ఉన్నాయి. వీటిలో ప్రతి శుక్రవారం పుర అధికారులు ఒక వార్డులోని ఒక హద్దున్నా భాగంలో కార్యక్రమం చేపట్టి ఆ వార్డులోని మిగతా భాగాలను పట్టించుకోకుండా మమ అనిపిస్తున్నారు. కనీసం ఆ వార్డు మొత్తం సందేశం అందట్లేదు అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. జిల్లాలోని పురపాలికలో

మున్సిపాలిటీ	జనాభా	వార్డులు
వనపర్తి	70416	33
కొత్తకోట	19042	15
పెబ్బేర్	15602	12
ఆత్మకూర్	15039	10
అమరచింత	10029	10

40వేల లోపు నివాసాలుంటాయి. ఉన్నతాధికారులు కనీసం ఆ వార్డు అధికారి, ఆర్పీలు, ఎవరికో బాధ్యత ఇచ్చి చేపట్టకపోవడంతో అధికారులు వెళ్లిన చోటు వరకే నిల్వనీటి పారబోత జరుగుతోంది. మిగతాచోట్ల అసలు ఆ ప్రస్తావన కనిపించడం లేదు. గత నెల రోజులుగా కార్యక్రమంలో ఇదే తేటతెల్లమవుతోంది. ఒకవేళ ప్రజలు అవగాహన పెంచుకున్నప్పటికీ తాగునీటి సరఫరాలో జాప్యం ప్రజలకు శాపంగా మారుతోంది. నీటి సరఫరాలో క్రమం తప్పడంతో నీటి విడుదల ఎప్పుడు జరుగుతందో తెలియని అయోమయ పరిస్థితి రెండు వారాలుగా నెలకొన్నది. ఈ నేపథ్యంలో అధికారుల సమర్థవంతమైన ప్రణాళిక లేకపోవడంతో నిల్వ నీటి పారబోతపై ఆశించిన మార్పు కనిపించడం లేదు.

నిల్వ నీటితో వ్యాధులు :

నీటి నిల్వతో దోమలు పెరిగి మలేరియ, డెంగీ, చికున్ గున్యా వ్యాధులు సోకే ప్రమాదం ఉందని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు ఇంట్లోని డ్రమ్ములు, హౌజ్‌లు, పూలతోట్లు, కూలర్లు, ట్యాంక్‌ల్లో నిల్వఉన్న నీటిని పారబోసేలా చూడాలని ఆదేశించారు.

మురుగు నిల్వపై ధ్యాస పెడతారా :

వర్ష కాలంలో రహదారులు, పలు కాలనీల్లో గుంతలు పడటం, ఇప్పటికే పలు కాలనీల్లో మురుగు నీరు నిల్వ అలాగే ఉంటున్నాయి. వాటిలో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు సోకేందుకు అవకాశం ఉంది. వీటన్నంటిపైన ప్రజల సౌకర్యాం పురపాలికల్లో కేటాయించిన ప్రత్యేక నిధులతో తక్షణ చర్యలు చేపడితే కొంత మేలు జరగొచ్చు. నీటిని నిల్వ ఉంచడం ప్రమాదకరమని విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం అధికారులపై ఎంతైనా ఉంది.

పక్కాగా అమలు



వనపర్తి పురపాలికలో పక్కాగా నిల్వ నీటి పారబోత కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. స్థానిక ప్రజలు మహిళా సంఘాలను భాగస్వాములను చేస్తున్నాం. ప్రజలు కూడా అవగాహనతో ముందుకొచ్చి బాధ్యతాయుతంగా మెలగాలి.

– ఎస్.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ వనపర్తి

భగీరథ లీకేజీతో తాగునీరు కలుషితం

- అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి

పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లి గ్రామంలో మిషన్ భగీరథ గ్రిడ్ పైపు లీకేజీతో తాగునీరు వృథాగా పోవడంతో కలుషితమవుతందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రిడ్ పైపు లైన్‌ను గత కొన్ని రోజులుగా లీకేజీ అవుతుండటంతో మరమ్మతులు చేసేందుకు గుంతను త్రవ్వి మరమ్మతులు చేయకపోవడంతో గత కొన్ని రోజుల నుంచి ముసురు వర్షాలు పడుతుండటంతో వర్షపునీటితో పాటు మురుగునీరు కూడా త్రవ్విన గుంతలోకి చేరి తాగునీరు కలుషితమవుతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఏఈ మహేశ్వరిని వివరణ కోరగా.. లీకేజీ విషయం మా దృష్టికి వచ్చిందని వెంటనే మరమ్మతులు చేయించి లీకేజీని అరికడతామన్నారు.



రాయినిపల్లిలో మిషన్ భగీరథ గ్రిడ్ పైపు లైన్ లీకేజవుతున్న దృశ్యం

కళాకారుల పింఛన్ ఇప్పించరూ..!

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన వృద్ధ నాగస్వర కళాకారుడు మంగళి నారాయణ తన కు కళాకారుల పింఛన్ మూడు నెలలుగా రావడం లేదని శనివారం విలేకరులతో తన ఆ వేదనకు వ్యక్తం చేశారు. ప్రతి నెలా రూ. 3వేల చొప్పున పింఛన్‌ను అందజేస్తున్న ప్రభు త్వం మూడునెలలుగా నిధుల కొరత ఉందని, రావాల్సిన డబ్బులను ఇవ్వడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి పింఛన్ డబ్బులను వెంటనే మంజూరు చేయించాలని ఆయన కోరారు.

చిన్నారులకు ప్లేట్ల పంపిణీ



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల గ్రామంలో చిన్నారులకు హెచ్‌ఎం రామచంద్రయ్య, కార్యదర్శి ఉమా మహేశ్వర్‌రెడ్డి పాల్గొని చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. శనివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కుర్మ న్న చిన్నారులకు స్టీల్ ప్లేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివా సులు, ఏఎన్‌ఎం వెంకటనర్సమ్మ, అంగన్‌వా డీ టీచర్లు రాజేశ్వరి పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణించేది ఎలా..?



కొత్తకోట సమీపంలో చర్లపల్లి, వడ్డెవాట వెళ్లే రోడ్డు గుంతలో నీళ్లు నిండిన దృశ్యం



అప్పరాల వెళ్లే రోడ్డు ముమ్మళ్లపల్లి సమీపంలో గుంతలమయంగా రోడ్డు

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలో చర్లపల్లి, వడ్డెవాట, వడ్డెవాట తండాలకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. ఈ రోడ్డు వెంట వెళ్లాలంటే నరకయాతనే. కొత్తకోట సమీపంలో ఈద్గా దగ్గర రోడ్డుపై పెద్ద గుంత తయారైంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు పూర్తిగా నిండిపోయింది. దీంతో అటుగా వెళ్లే ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా కొత్తకోట నుంచి చర్లపల్లికి వెళ్లే వరకు దాదాపు 6 కిలో మీటర్ల మేర రోడ్డు మొత్తం గుంతలు ఉండటంతో ఆటోలు, బైక్‌లపై వెళ్లేందుకు కష్టాలు తప్పడం లేదు. అదేవిధంగా అప్పరాల గ్రామానికి వెళ్లే రోడ్డు ముమ్మళ్లపల్లి గ్రామం నుంచి కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ వరకు రోడ్డు గుంతలుగా తయారైంది. ఈ రోడ్డు గూండా ప్రతిరోజూ పదుల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లు, ఆటోలు, బైక్‌లు వెళ్తుంటాయి. అత్యవసర సమయాల్లో ఈ రోడ్డు వెంట వెళ్లాలంటే ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తుందని అప్పరాల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్లను బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

'స్థానిక' ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్

కొత్తకోట రూరల్: స్థానిక ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్ అన్నారు. శనివారం మండలంలోని భూత్కూర్ గ్రామంలో పార్టీ సీనియర్ నాయకుడు పి.కృష్ణారెడ్డి, ఎన్‌జె బోయేజ్‌లతో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ పార్టీ అధ్యక్షుడు నాయకులను కార్యకర్తలను కలుపుకొని పనిచేయాలన్నారు. ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతిఒక్కరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ పీజే బాబు, మేస్త్రి శ్రీనివాసులు, చర్లపల్లి మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

యూరియా అందుబాటులో లేకపోతే చర్యలు

అమరచింత: రైతులకు యూరియాను అందుబాటులో డీలర్లు ఉంచకపోతే చర్యలు తప్పవని ఏఓ అరవింద్ అన్నారు. మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను శనివారం జాయింట్ కమిటీతో కలిసి తనిఖీ చేశారు. ఈ మేరకు ఆయా దుకాణాల్లో యూరియా, ఎరువులు, పురుగుల మందుల స్టాక్ వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యూరియాను అందుబాటులో ఉంచుతున్నదన్నారు. కొంతమంది డీలర్లు అవసరం మేరకు యూరియాను తెప్పిస్తున్నారన్నారు. తగిన విధంగా యూరియా బస్తాలను అందించాలని లేని పక్షంలో లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాములు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత



మదనాపురం: మండలంలోని దుప్పల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు శనివారం 1999– 2000 పదో తరగతి పూర్వ విద్యార్థుల సహకారంతో వాటర్‌ఫిల్టర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణగుప్తా, ఏఏపీసీ చైర్మన్ సుధారాణి, ఇంచార్జ్ హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థులు అలివేలు, శ్రీని వాసులు, హరికృష్ణ, ఎం శ్రీనివాస్, బాలరాజు, మన్నాజీ, అన్వర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని స్వాగతిస్తాం

వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలో పోరాట ఫలితంగా 600 కుటుంబాలకు మేలు చేసే విధంగా చిట్యాల డబుల్ బెడ్రూంలకు రోడ్డు వేయడాన్ని స్వాగతిస్తున్నామని, అక్కడ మిగతా సౌకర్యాలు కూడా చేయాలని ఎమ్మెల్యే, కలెక్టర్‌కు విన్నవిస్తున్నామని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా సంఘం తరఫున పోరాటం చేస్తుందన్నారు. కొన్ని విషయాల్లో స్పందిస్తూ వాటిని సరిచేస్తున్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు కృతజ్ఞతులన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అవినీతి పరులను ఓడిస్తామన్నారు. టీఎఫ్‌ఐడీసీ నిధులు కొందరు కిందిస్థాయి నాయకులు ఇష్టానుసారంగా వాడుతున్నారన్నారు. కార్యక్రమంలో సతీష్‌యాదవ్, వెంకటేశ్వర్లు, కొత్తగొల్ల శంకర్, గౌనికాడి యాదయ్య పాల్గొన్నారు.

మట్టి ఇళ్లల్లో నివసించొద్దు

అమరచింత: కురుస్తున్న వర్షాలతో ప్రజలు మట్టి మిద్దెల ఇళ్లలో నివసించొద్దని మున్సిపల్ కమిషనర్ నాగరాజు కోరారు. పట్టణంలోని ఆయావార్డుల్లో శనివారం సిబ్బందితో కలిసి మట్టి ఇళ్లలో నివసించే వారితో పాటు కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లకు వెళ్లి వారికి అవగాహన కల్పించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వర్షాల కారణంగా మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యూసుఫ్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బీజేపీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు

వనపర్తి రూరల్: నేడు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు పర్యటనను విజయవంతం చేయాలని పెబ్బేరు ఉమ్మడి మండల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర బీజేపీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పురుషోత్తంరెడ్డి కోరారు. శనివారం పెబ్బేరు పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ..రాష్ట్ర అధ్యక్షుడు గద్వాల పర్యటన ముగించుకొని పెబ్బేరు పట్టణానికి వస్తున్న సందర్భంగా వారికి రంగాపురం బైపాస్ నుంచి భారీ బైక్‌ర్యాలీతో స్వాగతం పలకాలన్నారు. ర్యాలీలో భారీసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు గౌని వేమారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు క్రాంతి, నాయకులు వెంకట్రామరెడ్డి, రంగస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి



డిప్యూటీ తహసీల్దార్ తిలక్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

గోపాల్‌పేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని జిల్లా దివ్యాంగుల అసెంబ్లీ ఇంచార్జి జనార్దన్ డిమాండ్ చేశారు. శనివారం దివ్యాంగులు డిప్యూటీ తహసీల్దార్ తిలక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగులు సమాజంలో అందరితో సమానమేనన్నారు. హక్కుల చట్టం 2016 ఐక్యరాజ్యసమితి పూర్వ మార్గదర్శకాల ప్రకారం గ్రామ పంచాయతీ, మండల పరిషత్, పురపాలక సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్ వంటి స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు సమాన హక్కులు కల్పించడంతో పాటు అర్హులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్రంలో 20 లక్షల దివ్యాంగులు ఉండగా కుటుంబ సభ్యులతో కలిపితే 80 లక్షల వరకు ఉంటారని గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించి స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేటెడ్ పదవులు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాంలీ, రాజు, భాగ్యమ్మ, మహేందర్ ఉన్నారు.

అరాచక పాలనను సాగనంపాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత: రాష్ట్రంలో మాయమాటలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగిస్తున్నదని వీటిని స్థానిక ఎన్నికల్లో తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని కాంగ్రెస్ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కొట్లాడి తెచ్చుకున్న బంగారు తెలంగాణను ఆగం చేస్తున్నారని ఇచ్చిన హామీలను అమలుపర్చలేని స్థితికి రాష్ట్ర ప్రభుత్వం దిగజారిందన్నారు. ప్రపంచదేశాల్లో తెలంగాణను ఒక రోల్ మోడల్‌గా కేసీఆర్ తీర్చిదిద్దడం జరిగిందని, సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి తెలంగాణలో వ్యవసాయాన్ని పండుగల తీసుకోచ్చామన్నారు. రైతులకు సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా పెట్టుబడి సాయం అందించామన్నారు. రైతును రాజుగా మార్చుతామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని సైతం అందించలేని స్థితిలో ఉందన్నారు. రైతుభరోసా అంటూ రైతులను మోసం చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. మత్స్యకారులతో పాటు గొర్రెల కాపరులకు సబ్సిడీపై చేపలు, గొర్రెలు అందించామని అలాంటిది ఇప్పుడు మత్స్యకారులకు ఉచిత చేపపిల్లలను సైతం ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కూడా పూర్తి కాలేదని అప్పుడే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చీదరించుకుంటున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన పనులే దర్శన మిస్తున్నాయని కొత్తగా ఏం జరిగిందో మంత్రి శ్రీహరి ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మత్స్యశాఖ మంత్రిగా ఉంటూ నియోజకవర్గంలో ఇప్పటికి ఎన్ని లక్షల చేపపిల్లలు వదిలాడో ఇక్కడి మత్స్య కారులకు వివరించాలన్నారు. జరగబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో ఉంటూ బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, నరసింహులు గౌడ్, మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌సింగ్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎస్ఎ.రాజు, ఆత్మకూర్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, బీఆర్‌ఎస్వీ ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, రమేష్, బాలరాజ్, నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.

చంద్రఘడ్‌ను సందర్శించిన స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం



అమరచింత: మండలంలోని చంద్రఘడ్ గ్రామాన్ని శనివారం మండల స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పరిశీలించింది. ఈ మేరకు ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి మాట్లాడుతూ..గ్రామంలో స్వచ్ఛతనం-పచ్చదనం తో పాటు తడి, పొడి చెత్త ట్రాక్టర్ ద్వారా డంపింగ్‌యార్డుకు చెత్త తరలించే పద్ధతులను పరిశీలించారన్నారు. గ్రామంలో ఇంకుడు గుంతలు, పరిసరాల శుభ్రతపై అధ్యయనం చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, పంచాయతీ కార్యదర్శి సరిత, బాల్‌రెడ్డి, ఏపీఓ రఘుపతిరెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.